క్లుప్తంగా

'చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు

వాంకిడి: హైదరాబాద్‌లో సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించే మహాధర్నా పోస్టర్లను పీఆర్‌టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు ఉప్రె వినేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, సీపీఎస్ రద్దు చేయాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు గిర్మాజీ, ఆమేరు మిసా, విద్యాసాగర్, ప్రియాంక పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై అనిల్ కుమార్

పెంచికల్‌పేట్: మండలంలోని పోతెపల్లి గ్రామంలో శనివారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై అనిల్ కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం పౌరులకు హక్కులను ప్రసాదించిందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ హక్కులను కాపాడుకోవడంతో పాటు రాజ్యాంగం ఇచ్చిన విధులు పాటించాలని సూచించారు. గ్రామాల్లో మూఢనమ్మకాలు, అంటరానితనాన్ని రూపుమాపి సమసమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం కన్వీనర్‌గా నవీన్



నవీన్‌ను సన్మానిస్తున్న నాయకులు

కౌటాల: బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్‌గా మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన రాంటెంకి నవీన్‌ను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నియమించడంతో శనివారం మండల కేంద్రంలో నవీన్‌ను బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, పార్టీ మండల కన్వీనర్ నాగపూరే బండు, మండల మహిళ కన్వీనర్ దుర్గం మమత, నాయకులు ఆనంద్‌రావు, సురేశ్, సందీప్, ఆనంద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: మహారాష్ట్రలోని ఏటపెల్లికి చెందిన గంజాయి విక్రేత రామమోడీ లేకామిని శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఈజ్‌గాం ఎస్సై కల్యాణ్ తెలిపారు. ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలువురికి గంజాయిని సరఫరా చేస్తున్నాడనే సమాచారంతో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. గంజాయిని విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఎవరైనా గంజాయి సరఫరా చేసినట్లు సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న ఎస్పీఎం అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ఎస్పీఎం మిల్లు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని చింతగూడ కోయవాగు జెడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎస్పీఎం మిల్లు జీఎం ఎం.ఎస్ గిరి, ఎంఈవో వాసాల ప్రభాకర్‌లు మాట్లాడుతూ పర్యావరణ అవగాహన పెంచడమే లక్ష్యంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా విద్యార్థులు ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఎస్పీఎం అసిస్టెంట్ మేనేజర్ రేవతి, సుశీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సాగు కష్టం.. మిగిలేది నష్టం

- లాభార్జనే ధ్యేయంగా వ్యాపారుల గోల్‌మాల్
- ఇష్టారాజ్యంగా ఎరువులు, పురుగుల మందులు అంటగడుతున్న వైనం
- పిచికారీ చేసి నష్టపోతున్న రైతులు
- జిల్లాలో 4.40 లక్షల ఎకరాల్లో పంటలు సాగు



ఫర్టిలైజర్ షాప్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఏడీఏకు వినతిపత్రం అందజేస్తున్న రైతు మల్లేశ్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న పలు ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు ఇష్టారీతిగా ఎరువులు, పురుగు మందులు అంటగడుతున్నారు. చాలా వరకు జిల్లాలో ఏజెన్సీ గ్రామాలు ఉండడంతో రైతులకు చదువు లేక షాపు యజమానులు ఇచ్చిన మందులు తీసుకెళ్తున్నారు. ఇదే అదునుగా ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు లాభార్జనే ధ్యేయంగా ఇష్టానుసారంగా రైతులకు పురుగుల మందులు, ఎరువులు విక్రయిస్తున్నారు. కొందరు రైతులు షాపు యజమానులు ఇచ్చిన మందులు పిచికారీ చేసి నష్టపోయి లబోదిబోమంటున్నారు.

అవసరం లేకున్నా..

జిల్లాలో ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని ఆసరా చేసుకుని కొందరు వ్యాపారులు అవసరం లేకున్నా రైతులకు ఇతర ఎరువులు, పరుగుల మందులు అంటగడుతున్నారు. బస్తా యూరియా కావాలంటే అదనంగా కాంప్లెక్స్, పొటాష్, డీఏపీ వంటి ఎరువులు సైతం కొనాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో గత్యంతరం లేక అమాయక రైతులు ఇతర ఎరువులు సైతం కొనుగోలు చేసి ఆర్థికంగా చితికిపోతున్నారు.

పెరిగిన పెట్టుబడి..

జిల్లాలో 4.40 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది గత సంవత్సరం కంటే విత్తనాలు, ఎరువులు, కూలీలు, ట్రాక్టర్ రేట్లు గణనీయంగా పెరగడంతో దాని ప్రభావం రవాణా, కౌలు, ఇతర వ్యవసాయ సామగ్రిపై పడింది. దీంతో పెట్టుబడి అధికమై రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయం కంటే కూలీ పని చేసుకోవడం ఉత్తమమని రైతులు వాపోతున్నారు. దానికి తోడు గత పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వాగు, ఒర్రెల సమీపంలోని పంటలు నీట మునిగి మురిగిపోయాయి.

ఎరువు బరువాయే..

యూరియా కొరతతో రైతులు తిప్పలు పడుతున్నారు. కొంత మంది ఫర్టిలైజర్ షాప్ నిర్వాహకులు ఎవరైనా రైతులు డీఏపీ కొనుగోలు కోసం వెళ్తే ఆధార్ కార్డుపై డీఏపీకి బదులుగా యూరియా కొనుగోలు చేసినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో రైతులు యూరియా కోసం వ్యవసాయ కార్యాలయానికి వెళ్లినప్పుడు యూరియా బస్తాలు తీసుకున్నట్లు చూపిస్తోంది. దీంతో రైతులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. రైతులు ఫర్టిలైజర్ షాపునకు వెళ్లి ప్రశ్నిస్తే పొరపాటు జరిగిందని యూరియా ఇస్తామని చెప్పి పంపిస్తున్నారు.



అంకుసాపూర్‌లో ఎర్రబడిన పత్తి పంట

పత్తి పంట ఎర్రబడింది



జిల్లా కేంద్రంలోని హసన్ ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు ఇచ్చిన పురుగు మందును పత్తి పంటలో పిచికారీ చేశాను. రూ.5,100తో మందు తీసుకొని పిచికారీ చేస్తే పత్తి పంట ఎర్రబడింది. అధికారులు నాకు న్యాయం చేయాలి. రైతులను మోసం చేసే షాపులపై చర్యలు తీసుకోవాలి.

– బోయిని మల్లేశ్, అంకుసాపూర్

మోసం చేస్తే చర్యలు



ఫర్టిలైజర్ షాపుల యజమానులు మందులను ఇష్టానుసారంగా అమ్మితే చర్యలు తీసుకుంటాం. పురుగుల మందు అమ్మినప్పుడు వాటి ఎక్స్‌పైరీ డేట్, కంపాటబిలిటీ తెలుసుకున్న తర్వాతే అమ్మాలని సూచించాం. నష్టపోయిన రైతులు పిచికారీ చేసిన మందులను ల్యాబ్‌కు పంపించాం. రిపోర్టు వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటాం.

– మిలింద్, ఏడీఏ

భక్తిశ్రద్ధలతో గణేశ్ నవరాత్రులు



ఆసిఫాబాద్: పైకాజీనగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో గణేశ్ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. నవరాత్రుల్లో 4వ రోజులో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు, ఆయా కాలనీల్లోని మండపాల వద్ద ఉదయం, సాయంత్రం మహిళలు పెద్దఎత్తున మంగళ హారతులతో పూజలు చేశారు. బీజేపీ వన్ నేషన్, వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్ రావు, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, సీఐ బాలాజీ వరప్రసాద్ జిల్లా కేంద్రంలోని బజార్‌వాడి సంఘసేవక గణేశ్ మండలి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు.



కౌటాల: పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప, భక్తులు

వినాయకుడికి పూజలు

కౌటాల: మండలంలోని భక్తులు భక్తిశ్రద్ధలతో ఆయా మండపాల్లో గణనాథుడికి పూజలు నిర్వహించారు. మండలంలోని ముత్తంపేట గ్రామంలోని ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాన్ని శనివారం సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



ఆసిఫాబాద్: బజార్‌వాడీ సంఘసేవక గణేశ్ మండలి వద్ద నాగేశ్వర్ రావు, నాయకులు




ఆసిఫాబాద్: అన్నదానంలో పాల్గొన్న సీఐ



ఆసిఫాబాద్: గాంధీచౌక్‌లో..

ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ నిర్లక్ష్యం



కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగి అల్లుకున్నాయి. పట్టణంలోని వార్డు నంబర్ 22లోని ప్రధాన నాలా పక్కన రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వీటి చుట్టూ మొక్కలు పెరిగి ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాల పైకి వెళ్లాయి. ఏ చిన్నపాటి గాలి వీచి, వర్షం పడినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. సమస్య పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు పలుసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా నిర్వహిస్తున్న ఇసుక రావాణా అరికట్టాలని డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు శనివారం జిల్లా కేంద్రంలో తహసీల్దార్ రియాజ్‌అలీకి వినతిపత్రం సమర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్‌లు మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా తీసుకెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకొని సీజ్ చేయాలని, అక్రమ ఇసుక మాఫియా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇంటి పేరుతో అక్రమ రవాణా జరుగుతుందని, మైనింగ్ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో మల్లేష్ ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎంపీడీవోకు ఆత్మీయ వీడ్కోలు

వాంకిడి: మండల ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన వి.ప్రవీణ్ కుమార్‌కు అధికారులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. శనివారం సాయంత్రం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ 43 ఏళ్ల సర్వీసులో ఎలాంటి అవాంతరాలు లేకుండా ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దంపతులను పూలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, డీఎల్‌పీవో ఉమర్, ఇన్‌చార్జి ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంపీవో జావిద్, ఎంఈవో శివచరణ్ కుమార్, ఏపీవో శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

ఓటరు జాబితాలో తప్పులు సవరించాలి

రెబ్బెన: గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శనకు ఉంచిన ముసాయిదా ఓటరు లిస్టులోని తప్పులు సవరించాలని సీపీఐ మండల కార్యదర్శి రాయిల్ల నర్సయ్య డిమాండ్ చేశారు. శనివారం గోలేటిలో విలేకర్లతో మాట్లాడుతూ అధికారులు ప్రదర్శించిన ఓటరు లిస్టులో తప్పులు ఉన్నాయని, స్థానికంగా ఉండని ఓటర్ల పేర్లను తొలగించలేదన్నారు. చనిపోయిన వారి పేర్లు, పెళ్లిళ్లు చేసుకుని వేరే గ్రామానికి వెళ్లిన వారి పేర్లను తొలగించకుండానే ఓటర్ లిస్టును తయారు చేశారన్నారు. ఒకే కుటుంబానికి చెందిన వారి పేర్లు వేర్వేరు వార్డుల్లో నమోదయ్యాయని పేర్కొన్నారు. తప్పుల తడకగా ఉన్న జాబితాను వెంటనే సవరించి తప్పులు లేని ఓటర్ జాబితాను ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

'ఓటరు జాబితా'పై అభ్యంతరాలు తెలుపాలి

ఆసిఫాబాద్‌అర్బన్: స్థానిక సంస్థల ఓటర్ల ముసాయిదా జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 31వ తేదీలోపు సమర్పించాలని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఓటరు జాబితాపై సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏమైనా పొరపాట్లు ఉంటే సంబంధిత అధికారులకు సరైన ధ్రువపత్రాలు అందజేసి సరి చేసుకోవాలని, అభ్యంతరాలు ఉంటే కార్యాలయంలో తెలియజేయాలని పేర్కొన్నారు.



లింగాపూర్: మాట్లాడుతున్న ఎంపీడీవో రామచందర్

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఓటరు ముసాయిదా తుదిజాబితాపై శనివారం రాజకీయ పార్టీల అధ్యక్షులతో ఎంపీడీవో అల్బర్ట్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యాలయాల్లో తుది జాబితాను ప్రదర్శించినట్లు ఆయన తెలిపారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిర్పూర్(టి)లో..

సిర్పూర్(టి): గ్రామపంచాయతీల వారీగా ఓటరు లిస్టు విడుదల, అభ్యంతరాల కోసం శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు లిస్టు జాబితాపై అభ్యంతరాలను గ్రామాల వారీగా వివిధ పార్టీల నాయకులు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో..

లింగాపూర్: పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రచురించిన ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాలపై చర్చించేందుకు శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రామచందర్ ఆధ్వర్యంలో మండలస్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం వివిధ పార్టీల ప్రతినిధులతో ఎంపీవో మహేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారుల ఆదేశాల మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీ వార్డులవారీగా ముసాయిదా ఫొటో ఓటర్ల జాబితాను రూపొందించి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాపై, ఓటర్ జాబితాపై అభ్యంతరాలుంటే తెలుపాలన్నారు. సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల తుది జాబితాను విడుదల చేస్తామన్నారు. సహకార సంఘం చైర్మన్ మాంతయ్య, మాజీ ఎంపీపీలు బసర్కార్ విశ్వనాథ్, నికాడే గంగారాం, మాజీ ఎంపీటీసీలు దుర్గం మోతిరాం, వసంత్‌రావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బండి రాజేందర్‌గౌడ్, బీజేపీ మండలాధ్యక్షులు కుంచాల విజయ్, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సిర్పూర్(టి): అభ్యంతరాలు స్వీకరిస్తున్న ఎంపీడీవో



కౌటాల: సమావేశం నిర్వహిస్తున్న అధికారులు



ఆసిఫాబాద్‌అర్బన్: మాట్లాడుతున్న ఎంపీడీవో

ఎంపిక గ్రామాల్లో సర్వే చేపట్టాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

కెరమెరి: ఎంపిక చేసిన గ్రామాల్లో సోమవారం నుంచి సర్వే చేపట్టాలని ఫీల్డ్ అధికారులకు ఎంపీడీవో ఎండీ అంజద్‌పాషా, ఎంఈవో ఆడే ప్రకాశ్ ఆదేశించారు. మండలంలోని మోడి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా 'ధర్తి ఆబా జన్ జాతీయ గ్రామీణ ఉత్సర్ష్ అభియాన్' కార్యక్రమంపై కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ పథకం కింద మండలంలోని ఏడు గ్రామాలు ఎంపికయ్యాయని, ఆయా గ్రామాల్లో కావాల్సిన మౌలిక సదుపాయాల కోసం సర్వే చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన 40 మంది ఫీల్డ్ అధికారులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వరరావు, ఎస్సీఆర్‌పీ నరేశ్, ఏపీఎం ముక్తేశ్వర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి గణిత జ్ఞానవిజ్ఞాన మేళాలో గెలుపొందిన విద్యార్థులకు శిశుమందిరాల జిల్లా కమిటీ సభ్యులు శనివారం బహుమతులు అందజేశారు. శిశుమందిర్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు అనిత మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానాన్ని వెలికితీసేందుకు పోటీలు ఉపయోగపడుతాయన్నారు. సభ్యులు సత్యనారాయణ, విభాగ్ అకాడమి ఇన్‌చార్జి పూదరి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి రాజన్న, జిల్లా సహాయ కార్యదర్శి మురళీధర్, కోశాధికారి సంతోష్ ఉన్నారు.